బోధనేతర పనులు మాకొద్దు..

- పాఠాలు చెప్పేందుకే పరిమితం చేయాలి
- కలెక్టరేట్ ఎదుట ధర్నాలో ఫ్యాప్టో నేతలు

ప్రజాశక్తి -చిత్తూరు అర్బన్: 'పాఠాలు చెప్పేందుకు మాకు అవకాశం ఇవ్వండి.. బోధనేతర పనుల నుండి విముక్తి కలిగించాలి..' అని కోరుతూ కలెక్టరేట్ ఎదుట ఫ్యాప్టో ఇచ్చిన పిలుపు మేరకు ఉపాధ్యాయులు శనివారం ధర్నా నిర్వహించారు. ఈ ధర్నాకు ఫ్యాప్టో జిల్లా ఛైర్మన్ మణిగండన్ అధ్యక్షత వహించారు. రాష్ట్ర ఫ్యాప్టో కార్యవర్గ సభ్యులు నరోత్తమ రెడ్డి మాట్లాడుతూ 'పిల్లలు బడికి వచ్చేది చదువు నేర్చుకోవడానికి టీచర్లు అంటే చదువు నేర్పేవారు' ఇది ఒకప్పటి సంగతి కాని నేడు 'పిల్లలు బడికి వచ్చేది, మధ్యాహ్న భోజనం, దుస్తులు, కోడిగుడ్డు, చిక్కి, రాగి జావ కోసం మాత్రమే అన్నట్టు టీచర్లు ఇవి పిల్లలకు అందించి ప్రభుత్వానికి లెక్క చెప్పేవారు' అన్నట్లుగా వుందన్నారు. ఇంకా ప్రభుత్వ ప్రచార కార్యక్రమాలను అమలు చేసే వారుగా వున్నారన్నారు. ఇవన్నీ పోనూ సమయం మిగిలితే విద్యార్థులకు నాలుగు అక్షరాలు చెప్పే అవకాశం ఉంటుంది. ఇదీ నిరుపేద పిల్లలు చదివే ప్రభుత్వ పాఠశాలల పరిస్థితి అని పేర్కొన్నారు. ఏకీకృత సర్వీస్ రూల్స్ సమస్యలు పరిష్కరించాలని ఎన్నిసార్లు ప్రాతినిధ్యం చేసినా అధికారులు పరిష్కరించలేదన్నారు. 72,73,74 జీవోల అమలు గాలికొదిలేశారన్నారు. 11వ పిఆర్‌సి గడువు ముగిసి 2 సంవత్సరాలు పూర్తి అయినా 12వ వేతన సవరణ సంఘాన్ని ఏర్పాటు చేయకపోవడం వల్ల రాష్ట్రంలోని ఉద్యోగ, ఉపాధ్యాయ, పెన్షనర్లలో ఆందోళన నెలకొందన్నారు. సిపిఎస్ రద్దు చేసి పాత పెన్షన్ అమలు చేయాలని డిమాండు లక్షలాది ఉద్యోగుల గొంతుకగా ఉన్నా కనీసం చర్చ కూడా లేదన్నారు. కేంద్రప్రభుత్వం 2004 సెప్టెంబరు 1నాటికన్నా ముందు వచ్చిన నోటిఫికేషన్‌తో నియామకమైన వారికి పాతపెన్షన్ విధానాన్ని అమలు చేయా లని మెమో నెం.57 ద్వారా ఆదేశాలు ఇచ్చిందని, పలు రాష్ట్రాలు ఈ ఉత్తర్వు లను అమలు చేశాయని తెలిపారు. మన రాష్ట్రం ఇప్పటికీ కూడా అమలు చేయని పరిస్థితి కొనసాగు తోందన్నారు. 2003 డియస్సీ ద్వారా నియామకమైన ఉపాధ్యాయులు, పోలీసు లు ఇతర ఉద్యోగులు సుమారు 11 వేల మందికి పాతపెన్షన్ విధానం అమలు చేయాల్సి వుందన్నారు. ధర్నా అనంతరం జిల్లా రెవెన్యూ అధికారి మోహన్ కుమార్‌కు పలు అంశాలపై మెమోరాండం సమర్పించారు. ఈ కార్యక్రమంలో ఫ్యాప్టో సెక్రటరీ జనరల్ జి మునీరహ్మద్, యుటిఎఫ్ రాష్ట్ర కార్యదర్శి జివి రమణ, ఏపీటీఎఫ్ 1938 రాష్ట్ర అదనపు ప్రధాన కార్యదర్శి చెంగలరాయ మందడి టాప్ టు కో ఛైర్మన్లు అరుణ్ కుమార్, రామమూర్తి, డిప్యూటీ సెక్రటరీ జనరల్స్ మదనమోహన్ రెడ్డి, చిట్టిబాబు, ముక్తారహ్మద్, జిల్లా ఫ్యాప్టో కార్యవర్గ సభ్యులు సోమశేఖర నాయుడు, మోహన్ యాదవ్, కిరణ్ కుమార్, గోపీనాథ్, సురేష్, టీఎన్‌యూఎస్ జిల్లా అధ్యక్షులు వై మధుసూదన, పలువురు మండల విద్యాశాఖ అధికారులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఫ్యాప్టో ఆధ్వర్యంలో నిరసన తెలుపుతున్న ఉపాధ్యాయులు

కుప్పంలో ప్రజాస్వామ్యాన్ని కాపాడండి

ప్రజాశక్తి -చిత్తూరు అర్బన్: ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు సారధ్యం వహిస్తున్న కుప్పం నియోజకవర్గంలో ప్రజాస్వామ్యాన్ని కాపాడాలని కాంగ్రెస్ చిత్తూరు జిల్లా అధ్యక్షుడు పోటుగారి భాస్కర్ డిమాండ్ చేశారు. శనివారం చిత్తూరు కలెక్టర్ కార్యాలయంలో మీడియాతో మాట్లాడుతూ కుప్పం నియోజకవర్గం రామకుప్ప మండలం మణింద్రం ఎంపీటీసీ సెగ్మెంట్ ఉప ఎన్నికల్లో కాంగ్రెస్ తరపున గీత నామినేషన్ వేసేందుకు వెళితే అక్కడ టిడిపి నాయకులు ఆనంద్ రెడ్డి అతని అనుచరులు కాంగ్రెస్ అధికార ప్రతినిధి శివశంకర్ తదితరలపై విచక్షణరహితం దాడులకు పాల్పడి వాహనాలను ధ్వంసం చేసి భయానక వాతావరణం సృష్టించారని తెలిపారు. దేశ విదేశాల్లో తనకు మంచి ఆదరణ ఉందని చెప్పుకునే ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు తన సొంత నియోజకవర్గంలో ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం చేసే విధంగా పెంచి పోషిస్తున్నారని దుయ్యబట్టారు. రానున్న ఎన్నికల్లో కనీసం నామినేషన్ వేసేందుకు ఏ పార్టీ అభ్యర్థులు ముందుకొచ్చే పరిస్థితి కుప్పం నియోజకవర్గంలో లేదన్నారు ఈ విషయమై చిత్తూరు కలెక్టరుకు, రాష్ట్ర ఎన్నికల సంఘానికి ఫిర్యాదు చేశామన్నారు. ఉప ఎన్నికలోనే ఇలాంటి వాతావరణం సృష్టిస్తే రానున్న ఎన్నికల్లో ఇంకెలాంటి వాతావరణం నెలకొంటుందో ఊహించుకోవచ్చు అన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ అధికార ప్రతినిధి శివ శంకర్, గంగాధర నెల్లూరు ఇన్‌ఛార్జి రమేష్ బాబు, పూతలపట్టు నియోజకవర్గ ఇన్‌ఛార్జి ప్రభాకర్ నాయకులు పరదేశి మహిళ నాయకురాలు కుమారి రెడ్డి, పలువురు కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

కలెక్టరేట్ ఎదుట కాంగ్రెస్ నిరసన

పలమనేరులో

పలమనేరు: చిత్తూరు జిల్లా కుప్పం నియోజక వర్గంలోని రామకుప్పం మండలంలో మనీంద్రం ఉప ఎన్నికల్లో దాడు లను చంద్రబాబు నాయుడు ఖండించాలని ప్రజాస్వామ్యబద్ధంగా ఎన్నికలు జరగాలని అందుకు సహకరించాలని ఏపీసీసీ రాష్ట్ర కార్యదర్శి శివ శంకర్ కోరారు. శనివారం పలమనేరు అంబేద్కర్ కూడలిలో అంబేద్కర్‌విగ్రహానికి వినతిపత్రం సమర్పించి నిరసన తెలిపారు. ఈ కార్యక్రమంలో డిసిసి అధ్యక్షులు పోటు భాస్కర్, మండల కాంగ్రెస్ అధ్యక్షులు, కార్యదర్శులు కార్యకర్తలు పాల్గొన్నారు.

బళ్లారి రాఘవాచార్య నేటితరం నటులకు ఆదర్శం

నివాళులు అర్పిస్తున్న జేసి విద్యాధరి

ప్రజాశక్తి -చిత్తూరుఅర్బన్ : రంగస్థలం నాటకానికి బళ్లారి రాఘవాచార్య విశేష సేవలు అందించారని జాయింట్ కలెక్టర్ జి విద్యాధరి పేర్కొన్నారు. జిల్లా సచివాలయంలో శనివారం నిర్వహించిన బళ్లారి రాఘవాచార్య జయంతి కార్యక్రమంలో డిఆర్‌ఓ కె మోహన్ కుమార్‌తో పాటు జెసి పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో భాగంగా బళ్లారి రాఘవాచార్య చిత్రపటానికి పుష్పాంజలి ఘటించారు. ఈ సందర్భంగా జెసి మాట్లాడుతూ తాడిపత్రి ఆచార్య అను పేరొం దిన బళ్లారి రాఘవాచార్య రంగస్థలం నాటకంలో వైవిధ్యమైన పాత్రలు ధరించి పరిణతి చెందిన కళాకారుడుగా గుర్తింపు పొందారని తెలిపారు. తొలి తరం కళామ్మతల్లి ముద్దుబిడ్డగా నేటితరం నటీనటులకు ఆదర్శప్రాయంగా నిలిచారన్నారు. రాయలసీమలో జన్మించిన రాఘవాచార్య రంగస్థలంలో తన నటనతో ఉన్నత శిఖరాలను అధిరోహించారన్నారు. గాంధీజీతో పాటు విశ్వకవి రవీంద్రనాథ్ ఠాగూర్‌లతో నటనతో శభాష్ అనిపించుకున్న నటులని తెలిపారు. తెలుగు నాటకాలతో పాటు ఆంగ్లం, కన్నడ భాషలలో సైతం నాటకాలను ప్రదర్శించారని తెలిపారు. నాటక ప్రదర్శనలో భాగంగా ఇంగ్లండ్ లో పర్యటించిన రాఘవాచార్య నాటక ప్రదర్శనలు చూసి బెర్నాడు షా మెచ్చుకున్నారన్నారు. ఈ కార్యక్రమంలో సెట్విన్ సీఈవో మోహన్ కుమార్, కలెక్టరేట్ ఏవో వాసుదేవన్, వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులు, కలెక్టరేట్ సిబ్బంది పాల్గొన్నారు.

చిత్తూరు అర్బన్: ప్రముఖ నాటక రచయిత, నటుడు, సంఘసేవకుడు బళ్లారి రాఘవ 145వ జయంతి పురస్కరించుకొని జిల్లా పోలీస్ కార్యాలయంలో ఆయన చిత్రపటానికి ఎస్పి మణికంఠ చందోలు నివాళులు అర్పించారు. ఆయన నిబద్ధత గురించి విద్యార్థులకు, యువతకు తెపాల్సిన అవసరం వుందని పేర్కొన్నారు.

క్వారీ పనులు నిలిపేయండి

- పేలుడుతో నిద్ర కరువు
- రాత్రంతా కాపలా కాస్తున్నాం..
- సమస్య పరిష్కరించాలని మహిళల నిరసన

ప్రజాశక్తి -బైరెడ్డిపల్లి: మండలంలోని టి గడ్డూరు గ్రామంలో క్వారీ పేలుడుతో నష్టం వాటిల్లుతోందని రక్షణకు గ్రామ మహిళలు అంతా కలిసి రాత్రి వేళల్లో షిఫ్ట్‌ల వారీగా నైట్ వాచ్‌మ్యాన్‌లా కాపలా కాయాల్సి వస్తోందని క్వారీ పనులు ఆపి వేసేందుకు చర్యలు తీసుకోవాలని కోరుతూ ఆ క్వారీ వద్ద మహిళలు శనివారం నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా టి గడ్డూరు మహిళలు మాట్లాడుతూ క్వారీ కారణంగా నిద్ర కూడా కరువైందని స్వేచ్ఛగా నిద్రపోవాలన్నా క్వారీ పేలుడులతో భయాందోళనకు గురవుతు న్నామన్నారు. నిద్రలో చిన్న పిల్లలు సైతం భయపడుతున్నారన్నారు. గ్రామంలో ఇళ్లకు పగుళ్ల ఏర్పడుతున్నాయని పేర్కొన్నారు. ఈ పేలుడు కారణంగా సమీపంలోని హంద్రీ- నీవా కాలువకు బీటలు ఏర్పడే ప్రమాదం వుందన్నారు. కలెక్టరు దీనిపై స్పందించి క్వారీ పనులు నిలిపివేసేందుకు చర్యలు తీసుకోవాలని కోరారు.

ఇంటర్ బోర్డు జిల్లా అధికారిగా రఘుపతి

ప్రజాశక్తి -చిత్తూరు అర్బన్: ఇంటర్మీయెట్ బోర్డు జిల్లా అధికారిగా ఎ రఘుపతి శనివారం బాధ్యతలు స్వీకరించారు. తిరుపతి జిల్లా వరదయ్యపాళ్యం ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపల్‌గా విధులు నిర్వహిస్తున్న రఘుపతి అదనపు బాధ్యతల నిర్వహణకు నియమితులయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో వివిధ రకాల ప్రభుత్వ జూనియర్ కళాశాలలు 130 ఉన్నాయని గత సంవత్సరం 27, 500 అడ్మిషన్లు నిర్వహించగా ఈ ఏడాది 28,120 అడిష్మన్లు చేశారని తెలిపారు. ఈనెల 11వ తేది వరకు అడ్మిషన్ల గడువు పెంచడంతో అడ్మిషన్లు పేరిగే అశకాశమున్నట్లు చెప్పారు. అనుభవజ్ఞులైన అధ్యాపకులున్న ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులను చెర్పించేందుకు తల్లిదండ్రులు ఆసక్తి చూపాలని కోరారు. నూతన డిఐఒగా బాధ్యత స్వీకరించిన రఘుపతిని ప్రైవేటు జూనియర్ కళశాలల యజమాన్యాలు మర్యాదపూర్వకం కలసి అభినందనలు తెలిపారు.

బాధ్యతలు స్వీకరిస్తున్న ఎ రఘుపతి

1200 ఓటర్లు దాటితే అదనపు పోలింగ్ కేంద్రాలు

- క్లెయిమ్‌ల పరిష్కారంలో జిల్లాకు ప్రథమ స్థానం
- డీఆర్‌వో కె మోహన్ కుమార్

ప్రజాశక్తి -చిత్తూరు అర్బన్ : జిల్లాలో 1200 ఓటర్లు దాటిన పోలింగ్ కేంద్రాల పరిధిలో ప్రస్తుతం ఉన్న పోలింగ్ కేంద్రాలకు అదనంగా పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేస్తామని డిఆర్‌ఓ కే మోహన్ కుమార్ తెలిపారు. జిల్లా సచివాలయంలోని డిఆర్‌ఓ ఛాంబర్‌లో డ్రాఫ్ట్ రేషనలైజేషన్ -2026 ప్రక్రియపై జిల్లాలోని అసెంబ్లీ నియోజకవర్గాల ఈఆర్‌ఓలు, ఏఈఆర్‌వోల తో కలిసి వివిధ గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధులతో డిఆర్‌ఓ శనివారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా డిఆర్‌వో మాట్లాడుతూ జిల్లాలో ప్రస్తుతం 1,776 పోలీస్ స్టేషన్లు ఉన్నాయని, వీటికి అదనంగా 1,200 ఓటర్లు మించిన పోలీస్ కేంద్రాల పరిధిలో అదనంగా పోలింగ్ స్టేషన్ లు ఏర్పాటు చేస్తామని తెలిపారు. ఈ ప్రక్రియతో మొత్తం జిల్లాలో 1,974 పోలింగ్ కేంద్రాలకు చేరనున్నాయన్నారు. వీటితో పాటు మరమ్మతుకు గురైన , శిథిలావస్థలో వున్న భవనాల నుండి పోలింగ్ స్టేషన్లను అనువైన ప్రాంతాలకు మార్పు చేస్తామని తెలిపారు. అవసరమైన చోట పోలింగ్ స్టేషన్ల పేర్లు మార్పు చేస్తామని పేర్కొన్నారు. పుంగనూరు నియోజకవర్గానికి సంబంధించి ప్రస్తుతం 265 పోలింగ్ కేంద్రాలు ఉన్నాయని వీటికి అదనంగా 17 మొత్తం 282, నగరి నియోజకవర్గంలో ప్రస్తుతం 233 పోలింగ్ కేంద్రాలు ఉన్నాయని అదనంగా 29 మొత్తం 262, గంగాధర నెల్లూరు నియోజక వర్గంలో 256 పోలింగ్ కేంద్రాలు ఉన్నాయని అదనంగా 21 మొత్తం 277 కానున్నాయని తెలిపారు. చిత్తూరు నియోజకవర్గంలో ప్రస్తుతం 229 పోలింగ్ కేంద్రాలు ఉన్నాయని అదనంగా 27 మొత్తం 256, పూతలపట్టు నియోజకవర్గంలో ప్రస్తుతం 262 కేంద్రాలు కాగా అదనంగా 32 మొత్తం 294, పలమనేరు నియోజకవర్గంలో ప్రస్తుతం 288 పోలింగ్ కేంద్రాలు కాగా అదనంగా 21 మొత్తం 309 కానున్నాయన్నారు. కుప్పం నియోజక వర్గంలో ప్రస్తుతం 243 పోలింగ్ కేంద్రాలు కాగా అదనంగా 51 మొత్తం 294 పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు కానున్నాయని తెలిపారు. ఓటర్ల జాబితా సవరణ లో భాగంగా క్లెయిమ్‌ల పరిష్కారంలో రాష్ట్రంలో జిల్లా ప్రథమ స్థానంలో ఉందని, నియోజక వర్గ పరిధిలో ఎప్పటికప్పుడు క్లెయిమ్‌లు పరిష్కరి స్తున్నామని తెలిపారు. బిఎల్‌ఏల నియామకానికి సంబంధించి ఎన్నికల సంఘం నిర్దేశించిన ప్రొఫార్మాలలో వివరాలను సమర్పిం చాల్సి ఉంటుందని తెలిపారు. బిఎల్‌ఓల శిక్షణ తరగతులు పూర్తి చేశామని పేర్కొన్నారు. కేంద్ర ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు 2002 ఓటర్ల జాబితా ప్రకారం త్వరలో స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ నిర్వహిస్తామని, విధివిధానాలు ఖరారు కావాల్సి వుందన్నారు. ఈ కార్యక్రమంలో చిత్తూరు ఆర్డీవో శ్రీనివాసులు, నగరి ఈఆర్‌వో, డిప్యూటీ కలెక్టర్ అనుపమ, గంగాధర నెల్లూరు ఈఆర్‌ఓ ఐటిసిఎల్ డిప్యూటీ కలెక్టర్ వెంకట శివ, పూతలపట్టు ఈఆర్వో డిప్యూటీ కలెక్టర్ విజయలక్ష్మి, కుప్పం ఆర్డీవో శ్రీనివాస్, టిడిపి, బిజెపి, వైసిపి, జనసేన, ఇండియన్ నేషనల్ కాంగ్రెస్ నాయకులు సిపిఎం అధికార ప్రతినిధులు వాడ గంగరాజు, సురేంద్ర కుమార్, అట్లూరు శ్రీనివాసులు, ఉదయ్ కుమార్, యశ్వంత్, పరదేశి, సురేంద్రబాబు, కలెక్టరేట్ ఏవో వాసుదేవన్, ఎలక్షన్ సెక్షన్ సూపరింటెండెంట్ రాజేంద్ర పాల్గొన్నారు.

మాట్లాడుతున్న డిఆర్‌వో మోహన్‌కుమార్

నాడి పట్టరు.. నాణ్యమైన వైద్యం చేయరు..!

- రోగులు చెప్పే నొప్పికే మందులు
- రోగులంటే వైద్యులకు నిర్లక్ష్యం
- ఆరోగ్యకేంద్రంలో బికాంప్లెక్స్ మాత్రలు కొరత

ప్రజాశక్తి- కార్వేనగరం: మండల కార్యాలయం సముదాయంలో పేద రోగులకు వైద్యం అందించాలన్న సంకల్పంతో 50 పడకల ఆస్పత్రిని ఏర్పాటు చేశారు. అందులో నేడు వైద్యులు రోగులపట్ల నిర్లక్ష్యం వహిస్తున్నారు. కనీసం బి కాంప్లెక్స్ మాత్రలు కరువయ్యాయి. ఆస్పత్రికి మందులు పూర్తిగా అందక పోవడంతో వైద్యులు సైతం రోగులను కనీసం వ్యాధి నిర్ధారణ కూడా చేయడంలేదు. నామమాత్రం మందులు రాసి పంపివేస్తున్నారు. రోగం నాయం కాకపోవడంతో రోగులు చేసేదేమీ లేక పుత్తూరు, తిరుపతి కార్పొరేట్ ఆస్పత్రులకు పరుగులు తీయాల్సిన దుస్థితి ఏర్పడింది.

బదిలీ అధికారుల ఫోను నెంబర్లతో దర్శనమిస్తున్న బోర్డు

నాడి పట్టరు.. నాణ్యమైన వైద్యం చేయరు..!

గత ప్రభుత్వంలో గ్రామీణ ప్రాంతాల్లో నిరుపేదలకు కార్పొరేట్ స్థాయిలో వైద్య సేవలు అందించాలనే సదుద్దేశంతో మండల కార్యాలయం సముదాయంలో 50 పడక ఆస్పత్రిని ఏర్పాటు చేశారు. అయితే వైసిపి ప్రభుత్వం అనంతరం అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం సామాజిక ఆరోగ్యకేంద్రంపై నిర్లక్ష్య ధోరణి అవలంబిస్తుండడం తో వైద్యాధికారులు అందుకు అనుగుణంగా వ్యవ హరిస్తున్నారు. డాక్టర్లే దేవుళ్లుగా భావించి వైద్య సేవల కోసం వచ్చిన రోగుల పట్ల వైద్య సిబ్బంది నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నట్లు రోగులు ఆరోపిస్తు న్నారు. డాక్టర్లు రోగులను చాలా చులకన భావంతో చూస్తూ కనీసం చేయిపట్టి పరిశీలించి రోగనిర్ధారణ చేయక, రోగులు చెప్పే వ్యాధులకే మందులు రాస్తున్నారని విమర్శలు జోరుగా వినిపిస్తున్నాయి.

రోగులంటే వైద్యలకు నిర్లక్ష్యం

రాత్రి వేళల్లో విధులు నిర్వహించే వైద్య సిబ్బంది రోగులపై అనుచిత వ్యాఖ్యలు చేస్తూ విరుచుకు పడుతున్నారని కొందరు ఆరోపిస్తున్నారు. బి కాంప్లెక్స్ మాత్రలతో పాటు పలు రకాల వ్యాక్సిన్లు అందుబాటులో లేదని, ప్రభుత్వం సరఫరా చేయడం లేదని వైద్య సిబ్బంది సమాధానం చెబుతున్నట్లు సమాచారం. వైద్య సిబ్బంది నిర్లక్ష్య సమాధానానికి విసిగిన కొందరు రోగులు ప్రాణాలు అరచేత పట్టుకుని పుత్తూరు, తిరుపతి కార్పొరేట్ ఆస్పత్రులకు పరుగులు తీస్తున్నారని అంటున్నారు.

అధికారులు మారినా నెంబర్లు మార్చరా..?

అధికారులు మారి కొన్ని నెలలు గడుస్తున్నా ఇంతవరకు డ్యాష్ బోర్డులో పాత అధికారుల ఫోన్ నెంబర్లు మాత్రమే నేటికీ దర్శన మిస్తోంది. అత్యవసరానికి ఫోన్లు చేసిన రోగులకు తాము కార్వేటినగరం నుంచి బదిలీపై వచ్చేశామని సమాధానాలు వస్తున్నాయని, కనీసం బదిలీపై వెళ్లిన అధికారుల ఫోన్ నెంబర్లు తొలగించి, ప్రస్తుతం విధులు నిర్వహిస్తున్న అధికారుల పేర్లు, ఫోన్ నెంబర్లు డ్యాష్ బోర్డులో తెలిపే సమయం కూడా లేదా? అని వైద్య సేవల కోసం వచ్చిన రోగులు ప్రశ్నిస్తున్నారు. రోజువారి విధులు నిర్వహించే వైద్యులు పేర్లు, వారి సెల్ నెంబర్లు డ్యాష్ బోర్డులో తెలపాలని కోరుతున్నారు.

రేపు జిల్లాకు రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి రాక

ప్రజాశక్తి -చిత్తూరు అర్బన్ : రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి సత్య కుమార్ యాదవ్ ఒక రోజు పర్యటనలో భాగంగా ఈ నెల 4వ తేదీ జిల్లాకు రానున్నారని కలెక్టర్ సుమిత్ కుమార్ శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. మంత్రి తన పర్యటనలో భాగంగా తిరుపతి నుండి రోడ్డు మార్గంలో బయలుదేరి ఉదయం 9 గంటలకు చిత్తూరు జిల్లా కార్వేటి నగరం మండలం పసల వానిమిట్ట గ్రామం చేరుకొని స్థానికంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో పాల్గొం టారని తెలిపారు. అనంతరం ఉదయం 10.45 గంటలకు చిత్తూరు మండలం ఈడిగపల్లి గ్రామానికి చేరుకొని హెల్త్ క్లినిక్‌ను ప్రారంభి స్తారని, తర్వాత మధ్యాహ్నం 12 గంటలకు పాలసముద్రం చేరుకొని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని తనిఖీ చేసి మధ్యాహ్నం 1.10 గంటలకు తిరుపతికి బయలుదేరి వెళతారని కలెక్టర్ తెలిపారు.

రైతుల అభివృద్ధి చంద్రబాబు తోనే సాధ్యం

- అన్నదాత సుఖీభవ, పీఎం కిసాన్ నిధుల పంపిణీలో మంత్రి రాంప్రసాద్ రెడ్డి

ప్రజాశక్తి - రొంపిచెర్ల : రైతుల అభివృద్ధే సీఎం చంద్రబాబు తోనే సాధ్యమని రాష్ట్ర రవాణా శాఖ మంత్రి రాంప్రసాద్ రెడ్డి అన్నారు. ఆయన శనివారం పుంగనూరు నియోజకవర్గ ఇన్‌ఛార్జి చల్ల రామచంద్రారెడ్డి తో కలిసి రొంపిచెర్లలో అన్నదాత సుఖీభవ, పీఎం కిసాన్ నిధులు విడుదల చేశారు. ఈ సందర్భంగా నిర్వహిం చిన సమావేశంలో మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన 13 నెలలో పెన్షన్ల పెంపు, ఉచిత బియ్యం, తల్లికి వందనం, అన్నదాత సుఖీభవ పథకాలు అమలు చేశామని తెలిపారు. ఈ నెల 15న మహిళలకు ఉచిత ఆర్టీసీ బస్సు పథకాన్ని కూడా ప్రారంభిస్తామని అన్నారు. రాయలసీమలోని చిత్తూరు అన్నమయ్య జిల్లాల్లో రైతులకు సాగునీరు అందించేందుకు గోదావరి నుంచి కాలువల ద్వారా నీరు తీసుకువస్తామని చెప్పారు. గతంలో మాజీ మంత్రి పెద్దిరెడ్డి నీరు లేకుండానే కాలువలు తవ్వారని గుర్తు చేశారు. తాము నీరు అందించేందుకు ప్రయత్నాలు చేస్తున్నామని తెలిపారు. గానుగచింతలో పది సంవత్సరాల క్రితం నిర్మించిన ప్రాజెక్టు ముంపు భూములకు ఇంత వరకు పరిహారం మంజూరు చేయలేదని తెలిపారు. నాడు నేడు పథకంలో ప్రభుత్వ పాఠశాలలకు రంగులు వేసి రూ. 1300 కోట్ల డబ్బులు కాజేశారని ఆరోపించారు. కలెక్టర్ సుమిత్ కుమార్ మాట్లాడుతూ ఖరీఫ్ సీజన్ లో వ్యవసాయ పంటలు సాగు చేసుకునేందుకు రైతులకు అన్నదాత సుఖీభవ పథకంలో రూ.5000, పీఎం కిసాన్ పథకంలో రూ.2000 వంతున 2,05,753 మంది రైతుల ఖాతాలలో రూ.138 కోట్లు జమ చేశారని తెలిపారు. రెండవ విడత అక్టోబరు, మూడవ విడత జనవరి నెలలో రైతులకు జమ చేస్తామని తెలిపారు. మామిడి రైతులకు రూ.135 కోట్ల సబ్సిడీ నిధులు వచ్చాయని తెలిపారు. వీటిని త్వరలోనే రైతుల ఖాతాలలో జమచేస్తామని తెలిపారు. ఈ కార్యక్ర మంలో పుంగనూరు నియోజకవర్గ ఇన్‌చార్జి చల్లా రామచంద్రారెడ్డి, జిల్లా వ్యవసాయ శాఖ జేడీ మురళీ కృష్ణ, తహశీల్దారు అమరనాథ్, కురబ కార్పొరేషన్ డైరెక్టర్ ఉయ్యాల రమణ, రొంపిచర్ల సర్పంచ్ ఆర్ ఇబ్రహీం ఖాన్, ఎస్‌సి సెల్ కార్యదర్శి ముల్లంగి వెంకటరమణ, పురం మల్లయ్య, ఏవో శ్రావణి పాల్గొన్నారు.

రైతులకు చెక్కు అందిస్తున్న మంత్రి

అప్రమత్తంగా ఉండాలి

సీజనల్ వ్యాధులపై జిల్లా మలేరియా అధికారి హెచ్చరిక

ప్రజాశక్తి- చిత్తూరు అర్బన్: సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా వుండాలని జిల్లా మలేరియా అధికారి వేణుగోపాల్, ఉప వైద్య ఆరోగ్యశాఖా ధికారి డాక్టర్ వెంకట ప్రసాద్ పేర్కొన్నారు. జిల్లా వైద్య ఆరోగ్యశాఖ కార్యాలయం సమావేశ మందిరం లో శనివారం సమీక్షా సమావేశం నిర్వహిం చారు. ఈ సందర్భంగా వేణుగోపాల్ మాట్లాడుతూ రాబోవు సీజన్ వర్షాకాలం కావడంతో కీటక జనిత వ్యాధులపై పక్కా ప్రణాళిక అవసరం అన్నారు. జిల్లాలోని అధికారులు మలేరియా, డెంగీ, మెదడు వాపు వ్యాధి, చికెన్ గున్యా ,ఫైలేరియా నివారణకు ముందస్తు జాగ్రత్తగా దోమలు లేకుండా చూడటం, లార్వాలను పూర్తిగా నాశనం చేయటం, తద్వారా మలేరియా, డెంగీ వ్యాపించదని తెలిపారు. రక్త పరీక్షలను పెంచడం, ఫీల్డ్ స్టాఫ్ అందరికీ రక్త నమూనాల పరీక్షల నిమిత్తమే ఆర్డిటి కిట్లు ఇవ్వటం, ఇంటి చుట్టుపక్కల నీటి నిల్వలు లేకుండా చూడటం, ఫ్రైడే డ్రైడే సమిష్టిగా అందరూ తప్పక చేయటం, ప్రతి గ్రామంలో ఫీల్డ్ స్టాఫ్ ద్వారా విపులంగా అవగాహన కార్యక్రమాలు నిర్వహించా లని సూచించారు. ఎక్కడా అడ్వెర్స్ న్యూస్ రాకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవడం, ప్రతి ఒక్కరి కర్తవ్యం అన్నారు. ఇందుకు ప్రతి ఒక్కరూ జాగ్రత్తలు పాటించాలని తెలిపారు. డాక్టర్ వెంకట ప్రసాద్ మాట్లాడుతూ టీబీ ముక్తభారత్ లో భాగంగా అనుమానిత లక్షణాలున్న వారికి , హై రిస్క్ వారికి టిబి నిర్ధారణకు గల్ల పరీక్ష చేయించాలన్నారు. అనుమానితులకు ఎక్స్‌రే కూడా చేయించాలని, పాజిటివ్ వచ్చిన వారికి వెంటనే చికిత్స ప్రారంభించి పూర్తి చికిత్స తీసుకునేలా అవగాహన కల్పించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఇన్‌ఛార్జి ఏఎస్‌ఓ భాను ప్రకాష్, సబ్ యూనిట్ అధికారి సుబ్రహ్మణ్యం, ల్యాబ్ టెక్నీషియన్లు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న ఉప వైద్య ఆరోగ్యశాఖాధికారి డాక్టర్ వెంకట ప్రసాద్

సూపర్ సిక్స్‌కు కోతల అడ్డు!

అందరికీ అందని పథకాలు

ప్రజాదృష్టి

ప్రజాశక్తి - చిత్తూరు అర్బన్: ఎన్నికల్లో సూపర్ సిక్స్ పథకాలు అమలు చేస్తామంటూ అధికారంలో కొచ్చిన కూటమి ప్రభుత్వం అధికారంలోకొచ్చి ఏడాదిన్నర లోపు తల్లికి వందనం, ఉచిత వంటగ్యాస్ పథకాలను అమలు చేసింది. ఏడాదికి మూడు ఉచిత గ్యాస్ సిలిండర్ల పథకంలో మొదటి గ్యాస్ సిలిండర్ పొందిన లబ్ధిదార్లు రెండు, మూడో ఉచిత సిలిండర్ కోసం ఎదురు చూస్తున్నారు. తల్లికి వందనం పథకం కుటుంబంలో ఎంత మంది పిల్లలుంటే అందరికీ వర్తింపజేస్తామన్న ప్రభుత్వం వివిధ ఆంక్షలతో అనర్హులుగా ప్రకటించి, విద్యుత్ బిల్లులు అధికంగా వస్తున్నాయని, ప్రభుత్వ నిబంధనల మేరకు ఇంటి నిర్మాణం లేదని కోత పెట్టింది. ఈ రెండు పథకాలపై ప్రతిపక్ష పార్టీల విమర్శలను ఎదుర్కోవాల్సి వచ్చింది. గత ఏడాది ఆగస్టు 15 న మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం పథకాన్ని అమలు చేస్తామని పెద్ద ఎత్తున ప్రచారం జరిగినా చివరి నిమిషంలో వాయిదా పడింది. ఈ ఏడాది 2025 ఆగస్టు 15వ తేది మహిళా ఉచిత బస్సు పథకాన్ని అమలు చేసేందుకు ప్రభుత్వం అన్ని ఏర్పాట్లు చేస్తున్నట్లు సమాచారం. విధి విధానాలపై రాష్ట్ర ప్రభుత్వం చర్చి స్తున్నట్లు కూటమి ప్రభుత్వ పెద్దలు చెబుతున్నారు.

జిల్లాలో అన్నదాత సుఖీభవ మొదటి విడత కింద 2,05,753 మంది రైతులకు రూ 138.16 కోట్లు జమ కానున్నాయి. ఆగస్టు రెండో తేది జిల్లాలోని రొంపిచర్లలో నిర్వహించిన అన్నదాత సుఖీభవ మొదటి విడత నిధుల విడుదల సభలో జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి మండపల్లి రాంప్రసాద్‌రెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. జిల్లా కేంద్రమైన చిత్తూరులో నిర్వహించిన సభలో కలెక్టర్ ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు. ఈ సమావేశాల్లో ఇప్పటి వరకు కూటమి ప్రభుత్వం అమలు చేసిన సూపర్ సిక్స్ పథకాలు గతంలో 43 లక్షల మందికి అమ్మ ఒడి అందించగా, ప్రస్తుతం 67.27 లక్షల మందికి తల్లికి వందనం అందిస్తున్నట్లు చెబుతున్నా అనేక మందిని అనర్హులుగా తేల్చారు. ఖరీఫ్ సీజన్ సాయంగా అన్నదాత సుఖీభవ కింద కేంద్ర ప్రభుత్వం రూ.2,000 రాష్ట్ర ప్రభుత్వం రూ.5,000 మొత్తం రూ.7,000 రైతు ఖాతాకు డిబిటి పద్ధతిలో నేరుగా జమ చేయడం చేయనున్నారు. జిల్లాలో మామిడి రైతులకు రూ.135 కోట్లు సబ్సిడీ కింద ఈ ఆగస్టు నెలలో జమ చేయనున్నట్లు ప్రభుత్వం ప్రకటిస్తున్నప్పటికీ ర్యాంపులకు తరలించిన తోతాపురికి సబ్సిడీ వర్తిందా? లేదా అనే అనుమానాలు తలెత్తున్నాయి. నీలం రకానికి కూడా ప్రభుత్వ సబ్సిడీ వర్తింపజేయాలని మామిడి రైతుల సంక్షేమ సంఘం ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తోంది. ఇదిలా ఉంటే ఈ ఏడాది మామిడి రైతులకు ఎదురైన చేదు అనుభవంతో జిల్లాలోని కొన్ని ప్రాంతాల్లో మామిడి చెట్లును తొలగిస్తున్నట్లు తెలుస్తోంది. జ్యూస్ ఫ్యాక్టరీలు మామిడి రైతులను అయోమయానికి గురి చేస్తున్నాయి. టన్నుకు 5వేలు, ఆరు వేలే చెల్లిస్తామని మామిడి రైతులను ఆందోళనకు గురి చేస్తున్నాయి. సబ్సిడీ టన్నుకు ప్రభుత్వం నాలుగు వేలు ఇచ్చినా జ్యూస్ ఫ్యాక్టరీ లు చెల్లించే బిల్లులపై రైతులు అను మానాలు వ్యక్తం చేస్తున్నారు. జిల్లాలో 2,05,753 మందికి రూ.138.16 కోట్లు జమ అవుతుందని తెలిపారు. ఆర్ ఓఎఫ్ఆర్ , సొంత భూమి కలిగిన రైతులకు పథకాన్ని నేరుగా అమలు చేయడంతో పాటు కౌలు రైతులకు సిసిఆర్ కార్డులు, ఈ క్రాప్ బుకింగ్ ద్వారా పథకాన్ని అమలు చేయనున్నారు. ఏదిఏమైనా 2025 ఆగస్టులో సూపర్ సిక్స్ రెండు పథకాలు రాష్ట్రంలో అమలవుతున్నాయి. ఆగస్టు రెండవ తేది అన్నదాతా సుఖీభవ అమలు అయింది. 15వ తేది మహిళా ఉచిత బస్సు ప్రయాణం అమలు కానుంది. మహిళా ఉచిత బస్సు ప్రయాణంలో అర్హులు, అనర్హుల విషయంలో ప్రభుత్వం పాదర్శంగా వ్యవ హరిస్తుందా? లేదా ఎక్కువ మందిని అనర్హులుగా ప్రకటించి మొండిచేయి చూపుతుందా? అనే విషయం తేలాలంటే ఆగస్టు 15 వరకు వేచి చూడాల్సిందే.

శరవేగంగా హైరోడ్డు విస్తరణ

ప్రజాశక్తి -చిత్తూరు అర్బన్: కలెక్టర్ సుమిత్ కుమార్ , ఎమ్మెల్యే గురజాల జగన్ మోహన్ మార్గనిర్దేశంలో కమిషనర్ పి నరసింహ ప్రసాద్ ఆదేశాల మేరకు చిత్తూరు నగరంలో హైరోడ్డు విస్తరణ పనులు వేగంగా సాగుతున్నాయి. కట్టమంచి వద్ద ఎండోమెంట్ స్థలంలో నిర్మించిన షాపు భవనాలను అస్సిస్టెంట్ సిటీ ప్లానర్ నాగేంద్ర హై రోడ్డుకు అవసరమైన వంద అడుగుల స్థలాన్ని జెసిబి సహాయంతో తొలగించారు. ఈ కార్యక్రమంలో టౌన్ ప్లాన్ సూపరవైజర్, టీబీపీవోలు, ప్రణాళిక సిబ్బంది పాల్గొన్నారు.

కృష్ణాపురం డ్యాం పరిశీలన

ప్రజాశక్తి -కార్వేటినగరం : మండల పరిధిలోని కృష్ణాపురం డ్యాంను సూపరింటెండెంట్ ఇంజనీర్ కె వెంకటరాజు శనివారం పరిశీలించారు. ఈ సందర్భంగా కుడి ఎడమ కాలువలను, డ్యామ్‌ను సందర్శించి వాటి వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఇరిగేషన్ శాఖ ద్వారా అభివృద్ధికి కృషి చేస్తామన్నారు. ఎస్ఇ వెంట డిఇఇ వరప్రసాద్ రెడ్డి, ఏఈ భాస్కర్ రాజ్యే, వర్క్ ఇన్స్పెక్టర్ వెంకటేష్, టిడిపి నాయకులు బిగల రమేష్, భద్రరాజు పాల్గొన్నారు.

వైసిపి రాష్ట్ర సోషల్ మీడియా సహాయ కార్యదర్శిగా మధుసూదన్ రెడ్డి

ప్రజాశక్తి - రొంపిచర్ల: వైసిపి రాష్ట్ర సోషల్ మీడియా సహాయ కార్యదర్శిగా రొంపిచర్ల మండలానికి చెందిన మేకల మధుసూదన్ రెడ్డి ని నియమిస్తూ కేంద్ర కార్యాలయం నుండి ఉత్తర్వులు జారీ చేశారు. సాఫ్ట్‌వేర్ ఇంజనీర్ గా పనిచేస్తున్న మధుసూదన్ రెడ్డి వైసిపి అభివృద్ధికి ప్రత్యేకమైన కృషి చేయడం, పార్టీ ప్రతిష్టతకు పాటు పడిన విషయం మాజీ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, రాజంపేట ఎంపీ పెద్దిరెడ్డి మిథున్ రెడ్డి , మాజీ ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్ రెడ్డి దృష్టికి తీసుకెళ్లారు. దీంతో జగన్ వైసిపి రాష్ట్ర సోషల్ మీడియా సహాయ కార్యదర్శిగా నియమించారు. ఈ సందర్భంగా మధుసూదన్ రెడ్డి మాట్లాడుతూ తనను పార్టీ కోసం శాయశక్తుల పనిచేస్తానని, తన వంతు కృషి చేస్తానని అన్నారు. తన నియామకానికి కృషిచేసిన పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, మిథున్ రెడ్డిలకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు.

పోస్టర్ ఆవిష్కరిస్తున్న వైసిపి నాయకులు

చెప్పిన హామీలను నెరవేర్చాలి

ప్రజాశక్తి -బంగారుపాళ్యం: చెప్పిన హామీలను నెరవేర్చాలని పూతలపట్టు నియోజకవర్గ ఇన్చార్జ్ సునీల్ కుమార్ అన్నారు. శనివారం మండలంలోని పాలేరు గ్రామంలో మండల కన్వీనర్ రామచంద్ర రెడ్డి ఆధ్వర్యంలో బాబు ష్యూరిటీ -మోసం గ్యారెంటీ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎన్నికల అప్పుడు ఇచ్చిన హామీలను నెరవేర్చక ఒక సంవత్సరం పూర్తయిన తర్వాత చెప్పిన హామీలు అమలు చేయడంలో నిర్లక్ష్య ధోరణి వ్యవహరిస్తున్నారన్నారు. బాబును నమ్మితే మోసాలు ఎక్కువ జరుగుతాయని ప్రతి ఒక్కరూ గుర్తించాలన్నారు. గ్రామస్తుల నుండి ప్రతి ఒక్కరూ చేపట్టి ప్రభుత్వంపై వ్యతిరేకతను తీసుకురావాలన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే లలిత కుమారి, జెడ్పీ మాజీ చైర్మన్ కుమార్ రాజా, వైస్ ఎంపిపి శిరీష్ రెడ్డి, సర్పంచులు సుబ్రహ్మణ్యం ,వాణిశ్రీ, శ్రీనివాసులు, ఎంపీటీసీలు హేమచంద్ర, మండల బిసి అధ్యక్షుడు ఫిరోజ్ అహ్మద్, పలువురు వైసిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

వినిత్ కుటుంబానికి ధైర్యం చెప్పిన ఎమ్మెల్యే

ప్రజాశక్తి - యాదమరి: యాదమరి మండలం, కీనాటం పల్లి గుట్టపై దళితవాడ కు చెందిన మోహన్ కుటుంబాన్ని ఎమ్మెల్యే డాక్టర్ కలికిరి మురళీ మోహన్ శనివారం పరామర్శించారు. ఎమ్మెల్యే వ్యక్తిగత సిబ్బంది వినిత్ తండ్రి మోహన్ అనారోగ్య కారణంగా మృతి చెందిన విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే వినిత్ నివాసానికి చేరుకుని వినిత్ ను, అతని కుటుంబ సభ్యులను పరామర్శించి ధైర్యం చెప్పారు. ఈ విషాద సమయంలో తమ కుటుంబానికి పూర్తిగా వారి వెంట ఉంటానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో చిత్తూరు జిల్లా ప్రధాన కార్యదర్శి కోదండ యాదవ్, యాదమరి మండల అధ్యక్షులు మురళీ యాదవ్, పూతలపట్టు మండల అధ్యక్షులు దొరబాబు చౌదరి, బంగారుపాళ్యం మండల అధ్యక్షులు ఎన్.పి.ధరణి నాయుడు, ఐరాల మండల అధ్యక్షులు గంగాధర, తవణంపల్లె మండల అధ్యక్షులు వెంకటేష్ చౌదరి, యాదమరి మండల ప్రధాన కార్యదర్శి రమేష్ రెడ్డి, బంగారుపాళ్యం మార్కెట్ కమిటీ చైర్మన్ భాస్కర్ నాయుడు, సింగిల్ విండో చైర్మన్ చిత్త నాయుడు, సింగిల్ విండో డైరెక్టర్ మహబూబ్ బాషా, ప్రభాకర్, ఏఎంసీ డైరెక్టర్ మోహన్, హరి ప్రసాద్(సతీష్), నాయకులు అమరనాథ్ నాయుడు, హేమాద్రి, విజయేంద్ర యాదవ్, జి.యస్.కుమార్, ధరణి, గోపి గౌడ్, కార్తీక్ పాల్గొన్నారు.

ఈవీఎం గోడౌన్‌లు తనిఖీ

ప్రజాశక్తి -చిత్తూరు అర్బన్ : జిల్లాలో గుర్తింపు పొందిన వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులతో కలిసి డిఆర్ఓ కె మోహన్ కుమార్ జిల్లా సచివాలయ ప్రాంగణంలోని ఈవీఎం గోడౌన్‌లను శనివారం పరిశీలించారు. స్థానిక కలెక్టరేట్లోని సమీపంలో ఈవీఎం గోడౌన్లో రాజకీయ పార్టీ నాయకులతో కలిసి డిఆర్ఓ పరిశీలించారు. ఈ సందర్భంగా సాధారణ తనిఖీలలో భాగంగా ఈవీఎం గోడౌన్లలో ఎలక్ట్రిఫికేషన్, కెమెరాల పనితీరును డిఆర్ఓ పరిశీలించారు. హమాలీల సాయంతో ఎన్నికల సామగ్రిని వరుస క్రమంలో అమర్చాలని, గోడౌన్లను శుభ్రంగా ఉంచుకోవాలని తెలిపారు. ఈ కార్యక్ర మంలో చిత్తూరు ఆర్డీవో శ్రీనివాస్, సిపిఎం, టిడిపి, బిజెపి, వైసిపి, జనసేన, ఇండియన్ నేషనల్ కాంగ్రెస్ నాయకు లు, సిపిఎం అధికార ప్రతి నిధులు వాడ గంగరాజు, సురేంద్ర కుమార్, అట్లూరు శ్రీనివాసు లు, ఉదయ్‌కుమార్, యశ్వంత్, పరదేశి, సురేంద్రబాబు, కలెక్టరేట్ ఏవో వాసుదేవన్, ఎలక్షన్ సెక్షన్ సూపరింటెండెంట్ రాజేంద్ర పాల్గొన్నారు.

ఈవీఎంల గోడౌన్‌ను తనిఖీ చేస్తున్న డిఆర్‌వో

ఘనంగా పింగళి వెంకయ్య జయంతి

ప్రజాశక్తి -చిత్తూరు అర్బన్: భారత జాతీయ పతాక రూపశిల్పి, స్వాతంత్ర్య సమరయోధుడు పింగళి వెంకయ్య 149వ జయంతి వేడుకలను పీవీకేఎన్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో శనివారం అత్యంత ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ జీవన్ జ్యోతి అధ్యక్షత వహించి, పింగళి వెంకయ్య చిత్రపటానికి పూలమాలలు , జ్యోతి ప్రజ్వలన చేసి ఘనంగా నివాళు లర్పించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ పింగళి వెంకయ్య కేవలం జెండా రూపకర్త మాత్రమే కాదు, ఆయన బహుముఖ ప్రజ్ఞాశాలి. గొప్ప దేశభక్తుడు, భూగర్భ శాస్త్రవేత్త, బహుభాషా కోవిదుడు అన్నారు. భారత స్వాతంత్ర్య సంగ్రామంలో ఆయన పాత్ర ఎనలేదని నేటి మన జాతీయ పతాకానికి తుదిరూపు ఇచ్చి, ప్రతి భారతీయుడి హృదయంలో దేశభక్తి జ్వాలను రగిలించిన మహనీయుడు ఆయన అన్నారు. ఆయన ఆశయ సాధనకు ప్రతి ఒక్కరూ కృషి చేయడమే ఆయనకు ఇచ్చే నిజమైన నివాళి' అని ఉద్బోధించారు.

నూతన ఏఎస్ఓగా శ్రీనివాసులు

ప్రజాశక్తి -సోమల: సోమల మండల ఏఎస్ఓగా శ్రీనివాసులు శనివారం బాధ్యతలు స్వీకరించారు. ఈయన పులిచెర్ల ఏఎస్ఓగా పనిచేస్తూ ఇన్ఛార్జిగా సోమలలో బాధ్యతలు చేపట్టినట్టు తెలిపారు. జనాభా లెక్కల సేకరణ, వ్యవసాయ పంటల గణన, చిన్న తరహా, నీటి పారుదల గణన, బోర్లు, బావులు తదితర లెక్కలను సేకరించి నమోదు చేస్తారని, మండలంలో ఎంత వర్షపాతం పడింది? నమోదు చేసి జిల్లా అధికారులకు అందిస్తారని తెలిపారు.

ఖాళీలు సద్వినియోగం చేసుకోవాలి

ప్రజాశక్తి-గంగాధర నెల్లూరు: వసతి గృహాల్లోని ఖాళీలను సద్వినియోగం చేసుకోవాలని ఎఎస్ డబ్ల్యువో షకీలా కోరారు. శనివారం ఆమె పత్రిక ప్రకటన విడుదల చేశారు. గంగాధర నెల్లూరు, తూగుండ్రం ,కొత్తపల్లిమిట్ట, ఉగ్రాణంపల్లి, పి కొత్తకోట, పూతలపట్టు, వసతి గృహాలలో మూడవ తరగతి నుండి పదవ తరగతి వరకు ఖాళీల్లో విద్యార్థులు చేరుటకు అవకాశం ఉందని, విద్యార్థులు వీటిని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ సంక్షేమ గృహాలలో ప్రతిరోజు విద్యార్థులకు స్టడీ అవర్స్ తో పాటు యోగ చేయించ బడునని తెలిపారు. వసతి గృహాలు చేరిన విద్యార్థులకు కొత్త దుప్పట్లు, కార్పెట్లు, ట్రంక్ బాక్సులు, స్టేషనరీ మొదలగు సౌకర్యాలు కల్పిస్తారని, ప్రతి రెండవ శనివారం డాక్టర్లచే ఉచిత ఆరోగ్య పరీక్షలు చేస్తారన్నారు. పదవ తరగతి విద్యార్థులకు ట్యూషన్ల చే ప్రత్యేక శిక్షణ, స్టడీ మెటీరియల్ ఇస్తారని తెలిపారు. ప్రభుత్వం నిర్ణయించిన మెనూ ప్రకారం సన్న బియ్యం తోపాటు పౌష్టికాహారం అందిస్తారని తెలిపారు. ప్రతి నెల రెండవ శనివారం తల్లిదండ్రుల సమావేశం ఏర్పాటు చేసి పిల్లల అభివృద్ధికి పాటుపడుతామని ఈ సదుపాయాలను పేద విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు.

మండలానికి 123 నూతన పింఛన్లు

ప్రజాశక్తి -సోమల: సోమల మండలానికి 123 నూతన వితంతు పింఛన్లు మంజూరైనట్లు ఎంపీడీవో నారాయణ తెలిపారు. మండలంలో మొత్తం 7197 పింఛనుదారులు ఉన్నారని వీరికి ఈనెల 1 ,2 తేదీలలో 98 శాతం పైగా పింఛన్ల పంపిణీ చేశామని తెలిపారు.

కుంకీ ఏనుగులతో ఏనుగుల నియంత్రణ

ప్రజాశక్తి -బంగారుపాళ్యం: కుంకీ ఏనుగులతో ఏనుగులను నియంత్రించేందుకు అటవీ శాఖ సిబ్బంది మూడు ఏనుగులను మొగిలి సమీపంలోని గౌను చెరువు వద్ద ఉంచారు. అడవిలో ఉన్న ఏనుగులను మళ్లించి ఏనుగులను పంట పొలాల పైకి రాకుండా నియంత్రించేందుకు వీటిని ఉపయోగిస్తున్నట్లు అటవీ శాఖ సిబ్బంది తెలిపారు.

మా గ్రామానికి దారి కల్పించండి

రోడ్డుపై బైఠాయించిన గ్రామస్తులు

ప్రజాశక్తి -బైరెడ్డిపల్లి: నాగిరెడ్డిపల్లెకు మిట్టపల్లి (వయా) బైరెడ్డిపల్లి జాతీయ రహదారికి దారి సౌకర్యం లేదని వెంటనే దారి కల్పించాలని గంగమ్మ గుడి క్రాస్‌లో రోడ్డుపై నాగిరెడ్డిపల్లి గ్రామస్తులు శనివారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నాగిరెడ్డిపల్లి గ్రామం నుండి పాఠశాలకు వెళ్లే విద్యార్థులు రైతు పంట అమ్ముకోవడానికి వెళ్లే రైతులు, ప్రజలు దారి సక్రమంగా లేకపోవడంతో అధికారులకు ఎన్ని మార్లు విన్నవించుకున్నా పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. నాయకుల దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోలేదని, ఫలితంగా విద్యార్థుల బస్సు గ్రామంలోకి వస్తే పలు ఇబ్బందులు పడుతూ వెళ్లాల్సి వస్తోందన్నారు. ఏ క్షణంలో ఏం జరుగుతుందోనన్న సందేశంతో అధికారుల దృష్టికి తీసుకెళ్లేందుకుగ్రామస్తులు అంతా కలిసి రోడ్డుపై ధర్నా నిర్వహి స్తున్నా మని తెలిపారు. విషయం తెలుసుకున్న మండల తహశీల్దారు, రక్షక సిబ్బంది అక్కడికి చేరుకొని రోడ్డుపై ధర్నా చేస్తున్న వారికి దారి సౌకర్యం కల్పనకు చర్యలు తీసుకుంటామని హామీ ఇవ్వడంతో మిట్టపల్లి గ్రామ సమీపంలోని దారి వద్దకు వెళ్లారు. గ్రామస్తులకు దారి సమస్య సంబంధించిన భూమి కలిగిన రైతును తహశీల్దారు ప్రసన్నకుమార్, వీఆర్‌వో కలసి సమస్యను క్షుణ్ణంగా అడిగి తెలుసుకున్నారు. ఎలా పరిష్కరిస్తారో వేచి చూడాల్సిందేనని గ్రామస్తులు పేర్కొంటున్నారు.

ధర్నా నిర్వహిస్తున్న నాగిరెడ్డిపల్లి గ్రామస్తులు

దేశ భద్రతపై అపోలో విద్యార్థుల మాక్ పార్లమెంట్

ప్రజాశక్తి -చిత్తూరు అర్బన్: చిత్తూరు అపోలో యూనివర్సిటీ మోడల్ యునైటెడ్ నేషన్స్ క్లబ్ విద్యార్థులు శనివారం కీలకమైన మాక్ పార్లమెంట్ నిర్వహించారు. 26/11 ముంబయి ఉగ్రదాడుల అనంతర జాతీయ భద్రతా సంస్కరణలపై పార్లమెంటరీ విధానంలో చురుకైన చర్చ సాగింది. ఈ కార్యక్రమానికి విశ్వవిద్యాలయ వైస్ చాన్స్‌లర్ డాక్టరు హెచ్ వినోద్ భట్ ముఖ్య అతిథిగా, రిజిస్ట్రార్ ప్రొఫెసర్ ఎం పాతరాజు అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా వీసీ డాక్టరు వినోద్ భట్ మాట్లాడుతూ భారత పార్లమెంట్‌కు ఎంతో గొప్ప చరిత్ర ఉందని, ఎన్నో చారిత్రాత్మక చర్చలు, కీలక నిర్ణయాలకు ఇది వేదికగా నిలిచిందన్నారు. ఎంతో మంది గొప్ప పార్లమెంటేరియన్లు సభ హుందాతనాన్ని నిలబెట్టారని తెలిపారు. భారత పార్లమెంట్‌పై జరిగిన ఉగ్రదాడి దేశ ప్రజల మనసులను కదిలించిందని చెప్పారు. పార్లమెంటులో జరిగే ప్రతి చర్చను ప్రజలు నిశితంగా గమనిస్తున్నారని, ప్రజా ప్రతినిధులు తమ బాధ్యతను మరవకూడదన్నారు.

ఘనంగా తల్లి పాల వారోత్సవాలు

ప్రజాశక్తి -వెదురుకుప్పం: కార్వేటినగరం ప్రాజెక్టు సిడిపిఓ శోభారాణి ఆధ్వర్యంలో వెదురుకుప్పం మండలం చవట గుంట అంగన్‌వాడీ సెంటర్లో శనివారం తల్లిపాలు వారోత్స వాలు నిర్వహించారు. పిల్లల తల్లులకు అవగాహనా నిర్వ హించారు. ఈ కార్యక్రమంలో తల్లిపాల ప్రాముఖ్యత గురించి వివరించి, ఆరు నెలలు నిండే వరకు తల్లిపాలే పట్టించాలని, డెలివరీ అయిన వెంటనే తల్లిపాలను వీలైనంత త్వరగా పట్టించాలని, ఏడో నెల మొదలుపెట్టిన వెంటనే సప్లిమెంటరీ ఫుడ్‌ని తల్లి పాలతో పాటు కొన సాగించాలని తల్లులకు అవగాహన కలిగించారు. ఈ కార్యక్రమంలో ఐసిడిఎస్ సూపరువైజర్ శకుంతల, అంగన్ వాడీ కార్యకర్త, అంగన్‌వాడీ సెంటర్ పరిధిలోని తల్లులు పాల్గొన్నారు.

గంగాధర నెల్లూరు: మండలంలోని గంగాధర నెల్లూరు అంగన్‌వాడీ కేంద్రంలో తల్లిపాలు ప్రారంభోత్సవాలు శనివారం నిర్వహించామని అంగన్‌వాడీ సూపరువైజరు అనురాధ తెలిపారు. తల్లిపాలు తాగడం వల్ల బిడ్డకి వ్యాధి నిరోధక శక్తి, రొమ్ము క్యాన్సర్ రాకుండా నివారించవచ్చని ఆమె తెలిపారు. అనంతరం ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆర్ సంగీత, ఏఎన్ఎం మమత, ఆశ వర్కర్ జ్యోతి, అంగన్‌వాడీ టీచర్ వాణి పాల్గొన్నారు.

సోమల: మండల కేంద్రమైన సోమల పంచాయతీ ముంద్రివారి పల్లి గ్రామంలో అంగన్‌వాడీ , వైద్య శాఖ ఆధ్వర్యంలో తల్లిపాల వారోత్సవాలను నిర్వహించారు. ఏఎన్ఎం గీత, అంగన్వాడీ టీచర్ మునీశ్వరి ఆధ్వర్యంలో గ్రామంలో తల్లులకు బాలింతలకు తల్లిపాల ప్రాముఖ్యత గురించి వివరించారు. తల్లిపాలు శిశువు ఎదుగుదలకు అన్ని విధాల పోషకాలను అందిస్తుందని, బిడ్డ పుట్టిన వెంటనే ముర్రుపాలు తాగించడం వల్ల రోగ నిరోధక శక్తి పెరిగి చిన్నారులు ఆరోగ్యంగా ఎదుగుతారని తెలిపారు. అనంతరం గ్రామంలో ర్యాలీ నిర్వహించారు.

పింగళి వెంకయ్య ధన్యజీవి

ప్రజాశక్తి -యాదమరి: జాతీయ పతాకం ఎగిరే వరకు స్మరించుకోదగిన ధన్యజీవి పింగళి వెంకయ్య ధన్య జీవి అని పిఆర్‌టియు రాష్ట్ర వైస్ ప్రెసిడెంట్ కె కనకాచారి, జిల్లా ఉపాధ్యక్షురాలు జె హిమబిందు అన్నారు. నిరాడంబరమైన, నిస్వార్థమైన జీవితం గడిపిన మహామనీషి పింగళి వెంకయ్య అన్నారు. శనివారం ఆయన జయంతిని నిర్వహించారు. ఈ సందర్భంగా పిఆర్‌టియు నాయకులు మాట్లాడుతూ జాతీయ పతాక నిర్మాత పింగళి వెంకయ్య మన ఆంధ్రుడు కావటం మన అదృష్టం అన్నారు. దేశం కోసం తన సర్వస్వాన్ని త్యాగం చేసిన ఆ మహా నీయుని నిత్యం మనం స్మరించు కోవాలని సూచిం చారు. ఆయ న జీవిత చరిత్రను బాల బాలికలకు పాఠ్యాంశంగా చేయాలన్నారు. గాంధీ కోరిక మేరకు జాతీయ త్రివర్ణ పతాకాన్ని పింగళి వెంకయ్య రూపొందించారన్నారు. ఆయన నిరాడంబరమైన, నిస్వార్థమైన జీవితం గడిపిన మహామనీషి అని ప్రశంసిం చారు. స్వాతంత్ర్య సంగ్రామం లో పింగళి వెంకయ్య పాత్ర ఎనలేనిదన్నారు.

చిత్తూరు అర్బన్: భారత జాతీయ పతాక రూపశిల్పి, స్వాతంత్ర్య సమరయోధుడు పింగళి వెంకయ్య 149వ జయంతి వేడుకలను పీవీకేఎన్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో శనివారం అత్యంత ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ జీవన్ జ్యోతి అధ్యక్షత వహించి, పింగళి వెంకయ్య చిత్రపటానికి పూలమాలలు , జ్యోతి ప్రజ్వలన చేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ పింగళి వెంకయ్య కేవలం జెండా రూపకర్త మాత్రమే కాదు, ఆయన బహుముఖ ప్రజ్ఞాశాలి. గొప్ప దేశభక్తుడు, భూగర్భ శాస్త్రవేత్త, బహుభాషా కోవిదుడు అన్నారు. భారత స్వాతంత్ర్య సంగ్రామంలో ఆయన పాత్ర ఎనలేదని నేటి మన జాతీయ పతాకానికి తుదిరూపు ఇచ్చి, ప్రతి భారతీయుడి హృదయంలో దేశభక్తి జ్వాలను రగిలించిన మహనీయుడు ఆయన అన్నారు. ఆయన ఆశయ సాధనకు ప్రతి ఒక్కరూ కృషి చేయడమే ఆయనకు ఇచ్చే నిజమైన నివాళి' అని ఉద్బోధించారు.

బుద్ధుని విగ్రహం ధ్వంసం కేసు పారదర్శకంగా చేపట్టాలి

ప్రజా సంఘాల డిమాండ్

ప్రజాశక్తి -వి కోట : మదనపల్లె రూరల్ మండలం, బుద్ధునికొండపై ఇటీవల బుద్ధుడి విగ్రహం తల నరికి ధ్వంసం చేసిన దుర్ఘటనపై స్పెషల్ ఇన్వెస్టిగేషన్ టీం (సిట్) ఏర్పాటు చేసి పారదర్శకంగా దర్యాప్తు చేపట్టాలని శనివారం వికోటలో వివిధ ప్రజా సంఘాల నేతలు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. చిన్నపిల్లల ఆటలో బుద్ధుడి విగ్రహం తల విరిగిపోయిందని, వారిలో ఒకరికి మతిస్థిమితం లేదని, విద్యాసాగర్ నాయుడు మీడియా సమావేశంలో చెప్పడం విచారకరమన్నారు. అది నమ్మేవిధంగా లేకపోవడంతో, తాము సిట్ దర్యాప్తు కోరుతున్నామని, అలాకోరడం కూడా పెద్ద నేరమైనట్లు ఎస్‌పి ఆగ్రహం వ్యక్తం చేయడం విచారకరమని వారు ఆవేదన వ్యక్తం చేశారు. న్యాయం కోరుతున్న బౌద్ధులపై ఇప్పటివరకు పలు తప్పుడు కేసులు నమోదు చేసినట్లు తెలుస్తోందని, ఇప్పుడు మరిన్ని కేసులు పెడతామని పోలీసులు బహిరంగంగా హెచ్చరించడం విచారకరమన్నారు. తొమ్మిదో తేదీ "ధమ్మ ర్యాలీ"కి అనుమతి ఇచ్చేదిలేదని బహిరంగ ప్రకటనలు చేయడమే కాక, వి.కోటలో ఉండే వారికి కూడా నోటీసులు ఇవ్వడం పట్ల ప్రజాసంఘాల నేతలు ఆందోళన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా ప్రభుత్వం, ప్రజా ప్రతినిధులు స్పందించి బుద్ధుని విగ్రహం ధ్వంసానికి పాల్పడిన అసలైన నిందితుల కఠినంగా శిక్షించే విధంగా తగు చర్యలు చేపట్టాలని విజ్ఞప్తి చేశారు. ఈ సమావేశంలో అంబేద్కర్ సేన రాష్ట్ర ఉపాధ్యక్షులు దొరస్వామి, పలమనేరు బిఎస్పి ఇన్‌చార్జ్ శ్రీనివాసులు, రజక సంఘం మండల అధ్యక్షులు మోహన్, గౌరవాధ్యక్షులు కృష్ణప్ప, ఎస్టీసెల్ మండల అధ్యక్షులు బాలాజీ నాయక్, సీనియర్ దళిత నేత శివరామ్, మాల మహానాడు మండల అధ్యక్షులు తంగరాజ్ తో పాటు బాస్ నేతలు వినోద్ కుమార్, సురేష్ పాల్గొన్నారు.

క్రైం న్యూస్

అప్పుల బాధ భరించలేక వ్యక్తి ఆత్మహత్య

ప్రజాశక్తి -బంగారుపాలెం : అప్పుల బాధ భరించలేక వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న సంఘటన శనివారం మండలంలోని తంబుగాని పల్లి వద్ద శనివారం చోటు చేసుకుంది. పోలీసులు కథనం మేరకు తంబుగానుపల్లి గ్రామానికి చెందిన సురేంద్ర నాయుడు కుమారుడు మధుసూదన్ నాయుడు (37) అప్పుల బాధ భరించలేక గ్రామానికి చెందిన సుబ్రహ్మణ్యం నాయుడుకు చెందిన మామిడి తోపులో చెట్టుకు ఉరివేసుకొని మృతి చెందాడు. ఇతనికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. కేసు దర్యాప్తు చేస్తున్నామని పోలీసులు తెలిపారు.

కారును ఢీకొన్న లారీ

పలువురికి గాయాలు

ప్రజాశక్తి -బంగారుపాలెం: కారును లారీ ఢీకొనడంతో పక్కన వెళుతున్న కంటైనర్ కిందికి కారు దూసుకువెళ్లి ఇరుక్కు పోయింది. ఈప్రమాదంలో కారులో ప్రయాణిస్తున్న ముగ్గురు గాయపడ్డారు. ఈ సంఘటన శనివారం మండలంలోని మొగిలి ఘాటు వద్ద చోటు చేసుకుంది. బెంగళూరు నుండి నెల్లూరు వెళుతున్న కారును వెనక వస్తున్న లారీ ఢీకొంది. ఈ సంఘటనలో కారు పక్కన వెళుతున్న కంటైనర్ కిందికి వెళ్లి ఇరుక్కుపోయింది. ఈ ప్రమాదంలో నెల్లూరుకు చెందిన చంద్రశేఖర్ రెడ్డి, మంజుల, సంగీత్ రెడ్డి లకు స్వల్ప గాయాలయ్యాయి, బంగారుపాలెం ప్రభుత్వ ఆసుపత్రిలో ప్రథమ చికిత్స చేపట్టి మెరుగైన చికిత్స కోసం చిత్తూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

సైబర్ నేరాల నివారణకు చర్యలు తీసుకోవాలి

- కలెక్టర్ సుమిత్ కుమార్

ప్రజాశక్తి -చిత్తూరు అర్బన్: సైబర్ నేరాల నివారణకు చర్యలు తీసుకోవాలి బ్యాంకు అధికారులకు కలెక్టర్ సుమిత్ కుమార్ సూచించారు. జిల్లా పోలీసు , కలెక్టర్ ఆధ్వర్యంలో జిల్లా స్థాయి బ్యాంకులు, నాన్-బ్యాంకింగ్ ఫైనాన్షియల్ ఇన్‌స్టిట్యూషన్స్ (ఎన్‌బిఎఫ్సీలు) భద్రతపై జిల్లా పరిషత్ మీటింగ్ హాలులో శనివారం సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి ఎస్‌పి విఎన్ మణికంఠ చందోలు, కలెక్టర్ సుమిత్ కుమార్ అధ్యక్షత వహించారు. అన్ని ప్రభుత్వ, ప్రైవేట్ రంగ బ్యాంకుల మేనేజర్లు, నాన్-బ్యాంకింగ్ ఫైనాన్షియల్ సంస్థల ప్రతినిధులు, లీడ్ బ్యాంక్ మేనేజర్ హాజరయ్యారు. ఈ సమావేశంలో ప్రధానంగా మూడు అంశాలపై చర్చించారు. భౌతిక భద్రతా ఏర్పాట్లు బ్యాంకుల పాత్ర, సైబర్ నేరాల నివారణలో అంతర్గత మోసాల నివారణకు తగిన జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ఎస్పీ మాట్లాడుతూ బ్యాంకుల శాఖలు, ఏటిఎంల వద్ద గరిష్ట భద్రత అవసరమని, నిబంధనలకు అనుగుణంగా భద్రతా చర్యలు అమలు చేయాలని సూచించారు. అన్ని శాఖల వద్ద 24 గంటల ఆయుధాలతో ఉన్న భద్రతా సిబ్బంది ఉండాలన్నారు. క్యాష్ చెస్ట్ బ్రాంచులకు ప్రత్యేక గార్డులు ఉండాలన్నారు. రాత్రి వేళలలో అధిక ప్రమాద ఉన్న శాఖలకు ప్రత్యేక నైట్ గార్డులు నియమించాలని సూచించారు. గార్డుల రొటేషన్ విధానం ఉండాలి, వారు అప్రమత్తంగా ఉన్నారా? లేదా అన్న విషయాన్ని నిశితంగా పరిశీలించాలి. అలారాలను పోలీస్ స్టేషన్ లేదా ప్రైవేట్ భద్రతా సంస్థలతో అనుసంధానించాలి. మేనేజర్ కేబిన్లు, క్యాషియర్ కౌంటర్లలో మౌన అలారాలు (పానిక్ బటన్స్) తప్పనిసరిగా ఏర్పాటు చేయాలి. స్ట్రాంగ్‌రూమ్‌లకు టైమ్-లాక్ వ్యవస్థలు అమలు చేయాలని సూచించారు. స్థానిక పోలీస్ గస్తీ షెడ్యూల్‌ను బ్యాంక్ మేనేజర్‌ల తో పంచు కోవాలన్నారు. వెల్డింగ్ చేసిన ఐరన్ గ్రిల్స్‌తో బ్యాంకు ద్వారాలను మూసివేయాలన్నారు. భద్రతా ప్రమాణాలతో నగదు బదిలీకి సంబంధించిన పద్ధతులు పాటించాలని ఎస్పీ తెలిపారు.

బస్సు కోసం పాఠశాల వద్దే వేచి చూస్తున్న విద్యార్థులు

పాఠశాల సమయానికి బస్సు నడపాలి

ప్రజాశక్తి -కార్వేటినగరం: విద్యార్థులకు అనుకూలం గా బస్సు సౌకర్యం కల్పించాలని డిఎంపురం ఉన్నత పాఠశాల విద్యార్థుల తల్లిదండ్రులు శుక్రవారం కోరారు. ఈ సందర్భంగా పిల్లల తల్లిదండ్రులు మాట్లాడుతూ బస్సు సౌకర్యాలు లేకపోవడంతో పిల్లలు ఆలస్యంగా ఇంటికి చేరు కుంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఎప్పుడు తమ పిల్లలు ఇంటికి చేరుకుంటారో తెలియని భయాందోళన రోజు రోజుకీ పెరిగి పోతోందన్నారు. విద్యార్థులకే సమయా నికి బస్సు సౌకర్యాలు కల్పించ లేని కూటమి ప్రభుత్వం మహిళలకు ఉచిత బస్సు ఏర్పాటు సౌకర్యం కూడా ఇలాగే ఉంటుందేమో అని విమర్శించారు. ఇప్పటికైనా రాజకీయ నాయకులు స్పందించి గ్రామీణ ప్రాంతాల్లో బస్సు సర్వీసులు సక్రమంగా నడిచేలా చూడాలని కోరారు. సాయంత్రం 5 గంటలు ఆయినా బస్సు రాకపోవడంతో కొందరు తల్లిదండ్రులు తమ పిల్లలను ద్విచక్రవాహనాల్లో తీసుకెళుతున్నారని అలాంటి సౌకర్యంలేని విద్యార్థులు పొద్దు పోయేవరకు బిక్కు బిక్కుమంటూ పాఠశాల ఆవరణలో ఉండి పోవడంతో పాఠశాల వాచ్‌మ్యాన్ వారికి రక్షణ కల్పించారు. విద్యార్థుకు పాఠశాల వదిలే సమయానికి తగిన బస్సు సౌకర్యం కల్పించాలని కోరారు.

సబ్సిడీ బియ్యం కోసం తప్పని కష్టాలు

ప్రజాశక్తి - రొంపిచర్ల: ప్రభుత్వం పేదలకు ఇస్తున్న రేషన్ బియ్యం తీసుకునేందుకు లబ్ధిదారులు తీవ్ర కష్టాలు పడుతున్నారు. రొంపిచర్ల మండలంలోని మోటు మల్లెల గ్రామపంచాయతీ ఏటుకూరు వారి పల్లెకు చెందిన లబ్ధిదారులు సబ్సిడీ బియ్యం కోసం రెండు కిలోమీటర్ల దూరంలోని గంగిరెడ్డిపల్లి కు పరుగులు తీస్తున్నారు. చౌక దుకాణానికి బియ్యం కోసం వెళితే మళ్ళీ ఎప్పుడు ఇంటికి వస్తామో చెప్పలేమని వాపోతున్నారు. సర్వర్ సమస్యతో చాలా సమయం అక్కడే ఉండాల్సి వస్తుందని, చౌక దుకాణం నుంచి సరుకులు తీసుకోవడం వల్ల నిరీక్షించాల్సి వస్తోంది. దీని వల్ల కూలీనాలీ చేసే అవకాశం కూడా లేకుండా పోతుందని ఆవేదన చెందుతున్నారు. గత ప్రభుత్వంలో ఇంటి వద్దకే వచ్చి సరుకులు ఇచ్చేవారని అన్నారు. ఇప్పుడు రెండు కిలోమీటర్ల దూరం వెళ్లి తెచ్చుకోవాల్సి వస్తోందని ఆవేదన చెందుతున్నారు. ప్రభుత్వం ఇళ్ల వద్దకే చౌక దుకాణ సరుకులు సరఫరా చేస్తే బాగుంటుందని ఆశాభావం వ్యక్తం చేశారు.

ఆపరేషన్ ట్రేస్‌కు సహకారం

ఎన్‌హెచ్‌ఆర్‌సిసిఎఫ్ ఛైర్మన్ మాదేశ్

ప్రజాశక్తి- పలమనేరు: అదృశ్య బాలికలను వెతికేందుకు డిజిపి ప్రకటించిన ఆపరేషన్ ట్రేస్‌కు తాము పూర్తి సహకారం అందిస్తామని యన్ హెచ్ ఆర్‌సిసి ఎఫ్ ఛైర్మన్ మాదేష్ పేర్కొన్నారు. ఏపీలో తప్పిపోయిన బాలికలను వెతికి కుటుంబ సభ్యులకు అప్పగించేందుకు 'ఆపరేషన్ ట్రేస్' నిర్వహిస్తున్నట్లు డిజిపి హరీష్ కుమార్ గుప్తా తెలిపారు. నేటి నుంచి 31వ తేదీ వరకు ఆపరేషన్ కొనసాగుతుందన్నారు. స్వచ్ఛంద సంస్థల సహకారం తీసుకుంటామని బస్టాండ్లు,రైల్వేస్టేషన్లు, రెడ్ లైట్ ఏరియాలో సెర్చ్ చేస్తామని బాలికలు మిస్ అయితే 112,1098 హెల్ప్ లైన్ లేదా వాట్సాప్ (7993485111) తెలపాలని సూచించారు. దీనిపై స్పందించిన నేషనల్ హ్యూమన్ రైట్స్ అండ్ క్రైమ్ కంట్రోల్ ఫోర్స్ ఛైర్మన్, నేషనల్ ప్రెసిడెంట్ ఎ.మాదేశ్, నేషనల్ కోఆర్డినేటర్ శివ శంకర్, గారి నేతృత్వంలో శనివారం ఎన్ హెచ్ ఆర్ సి సి ఎఫ్ రాష్ట్ర కార్యాలయంలో సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో సంస్థ ఛైర్మన్ మాదేశ్ సంస్థ సభ్యులందరికీ, ప్రభుత్వానికి, పోలీస్ శాఖకు సహక రించాలని ఆదేశాలు జారీ చేశారు. ఈ సంద ర్భంగా ప్రభుత్వం చేపట్టిన ఆపరేషన్ ట్రేస్ అనే కార్యక్రమానికి శ్రీకారం చుట్టినందుకు డిజిపి హరీష్ కుమార్ గుప్తా కు తమ సంస్థ తరఫున కృతజ్ఞతలు తెలిపారు.

రైతుల్లో ఆనందమే ధ్యేయం: ఎమ్మెల్యే

ప్రజాశక్తి - యాదమరి: రైతుల కళ్లలో ఆనందం చూడడమే కూటమి ప్రభుత్వ ధ్యేయమని ఎమ్మెల్యే కలికిరి మురళీమోహన్ పేర్కొన్నారు. పూతలపట్టు నియోజక వర్గం యాదమరి మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయం వద్ద శనివారం నిర్వహించిన 'అన్నదాత సుఖీభవ - పీఎం కిసాన్ పథకం' 2025 – 26 మొదటి విడత నిధుల విడుదల ప్రారంభోత్సవం నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన ఎమ్మెల్యే మాట్లాడుతూ రైతుల కష్టం తీర్చేందుకు కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీ నిలబెట్టుకుంటూ రైతుల కళ్లలో ఆనందం చూడడమే ధ్యేయంగా ఏడాదికి రైతులకు ఇచ్చే రూ.20 వేలలో మొదటి విడతగా రూ.7 వేలు రైతుల ఖాతాల్లో జమ చేశామన్నారు. ఈ కార్యక్రమంలో తహశీల్దార్ పార్థసారధి, ఎంపీడీవో వేణు, ఏఓ దీప, ఏపీఎం, సంధ్య రాణి, సీతాల గుణ, చిత్తూరు జిల్లా ప్రధాన కార్యదర్శి కోదండ యాదవ్, తదితరులు పాల్గొన్నారు.

యాదమరిలో

కార్వేటినగరం : కార్వేటినగరం ఎంపీడీవో కార్యాలయం లో శనివారం నిర్వహించిన అన్నదాత సుఖీభవ నిధుల పంపిణీ కార్యక్రమానికి శాసనసభ్యులు డాక్టర్ వి.ఎం థామస్ అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ నియోజకవర్గంలో 36047 మంది రైతు కుటుంబాలకు 24 కోట్ల 32 లక్షల 6300 వేలు రూపాయలు జమ చేశామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో టీ చంద్రమౌళి, తహశీల్దార్ నాగరాజు, ఏవో హేమలత, వెంకట మణి, దస్తగిరి, మునిరాజు, రంగ వేణు, భీమయ్య, సంధాని జగన్నాథం పాల్గొన్నారు.

చిత్తూరు అర్బన్: రైతులకు ఏపీ ప్రభుత్వం వెన్నుదన్నుగా నిలిచిందని చిత్తూరు ఎంపి దగ్గుమళ్ళ ప్రసాదరావు శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఢిల్లీ పార్లమెంటు సమావేశాలకు హాజరైన చిత్తూరు ఎంపీ దగ్గుమళ్ళ శనివారం ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం అన్నదాత సుఖీభవ, పీయం కిసాన్ పథకాన్ని ప్రారంభించడం పై హర్ష వ్యక్తం చేశారు.

వెదురుకుప్పం: వెదురు కుప్పం లో అన్నదాత సుఖీభవ , పీఎం కిసాన్ పథకం ప్రారంభోత్సవాన్ని వెదురుకుప్పం రైతు సేవా కేంద్రంలో ప్రసారం చేసిన ప్రధానమంత్రి నరేంద్ర మోడీ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ప్రసంగాన్ని శనివారం టిడిపి మాజీ మండల అధ్యక్షులు, టిడిపి క్లస్టర్ ఇంచార్జి మాజీ ఎంపీటీసీ మోహన్ మురళి తిలకించారు. ఈ కార్యక్రమంలో విలేజ్ అగ్రికల్చర్ అసిస్టెంట్ కావ్య, రైతులు దేవరాజుల శెట్టి, మనోహర్ నాయుడు, గోపీ, జానకి రామ్ రెడ్డి,ప్రసాద్ రెడ్డి, హరికృష్ణ రెడ్డి పాల్గొన్నారు

గ్రామ క్రీడోత్సవాన్ని జయప్రదం చేయాలి

జాతీయ వాలీబాల్ కళాకారుడు తులసి రెడ్డి

ప్రజాశక్తి -బంగారుపాళ్యం: గ్రామ క్రీడోత్సవాన్ని జయప్రదం చేయాలని జాతీయ వాలీబాల్ క్రీడాకారులు తులసి రెడ్డి అన్నారు. శనివారం మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానంలో ఈషా గ్రామ క్రీడోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా కోయంబత్తూర్ ఈషా నిర్వాహకులు స్వామి దక్షిత్ ఆధ్వర్యంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దక్షిణ భారతదేశంలో ఆరు రాష్ట్రాల్లో ఈశా గ్రామోత్సవ కార్యక్రమం నిర్వహిస్తున్నారని జిల్లా, రాష్ట్రంలో క్రీడా పోటీలు నిరసిస్తున్నారన్నారు. 14 సంవత్సరాల నిండిన ప్రతి ఒక్కరూ ఈ క్రీడల్లో పాల్గొనవచ్చుని వాలీబాల్, త్రోబాల్ పోటీలు నిర్వహిస్తున్నారని. జిల్లా స్థాయిలో గెలుపొందిన వారికి మొదటి బహుమతి పదివేలు, రెండవ బహుమతి ఏడు వేలు, మూడవ బహుమతి ఐదువేలు, నాలుగవ బహుమతి మూడు వేలు ఉంటుందని తెలిపారు. ఈ నెల 23, 24 తేదీలలో ఈ పోటీలు నిర్వహిస్తారని ఆసక్తిగల గ్రామీణ క్రీడాకారులు ఈ పోటీల్లో పాల్గొని వారిలో దాగి ఉన్న క్రీడా ప్రతిభను ప్రదర్శించి విజయం పొందిన వారిని రాష్ట్రం తరఫున విజయవాడలో పోటీల్లో పాల్గొంటారని తెలిపారు. అక్కడ గెలుపొందిన వారిని సెప్టెంబర్ 21న కోయంబత్తూర్ ఈషా యోగ కేంద్రంలో పోటీలో పాల్గొనాలని గ్రామీణ ప్రాంతం వారికి క్రీడల పట్ల ఆసక్తి చూపించేందుకు ఇది ఎంతో దోహదపడుతుందన్నారు. ఈ కార్యక్రమంలో జడ్పీ మాజీ ఛైర్మన్ కుమార్ రాజా, మాజీ సర్పంచి కృష్ణమూర్తి, ఉప సర్పంచ్ కామరాజు, డీఎస్ఓ బాలాజీ, పరదేశి, ఈశా వాలంటరీలు వినోద్, మహేష్, హరి పాల్గొన్నారు.